
# బాన్సువాడలో మృతదేహాల కలకలం

**నిర్మాణంలో ఉన్న భవనంలో మహిళ, బాలుడు అనుమానాస్పదస్థితిలో మృతి**

బాన్సువాడ, మే 19 : బాన్సువాడ పట్టణం న్యూవీక్లీ మార్కెట్ సమీపంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనంలో రెండు కుళ్లిన మృతదేహాలు కలకలం రేపాయి. గుర్తు తెలియని మహిళ, బాలుడి మృతదేహాలు లభ్యమైనట్లు పట్టణ సీఐ కృష్ణ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వీక్లీ మార్కెట్‌లో కొత్తగా నిర్మిస్తున్న భవనంలో మహిళ, బాలుడి మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని వాటిని పరిశీలించారు. మహిళ వయస్సు 30 నుంచి 35 ఏండ్లు, బాలుడి వయస్సు 6 నుంచి 8 ఏండ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఒంటిపై లేత గోధుమ రంగు టాప్ , నలుపురంగు పాయింట్ ధరించినట్లు పేర్కొన్నారు. బాలుడు ఆకుపచ్చ టీషర్టు , కాషాయ రంగు కలిగిన నిక్కరు ధరించినట్లు తెలిపారు. నాలుగైదు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తోందని, మృత దేహాలను బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సీఐ తెలిపారు. సంబంధీకులు, ఆనవాళ్లు గుర్తుపట్టినవారు సీఐ కార్యాలయంలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాలోని వస్తువులను చిందరవందర చేసిన దుండగులు

కామారెడ్డి, మే 19 : జిల్లా కేంద్రంలోని రాజానగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజానగర్ కాలనీలో నివాసం ఉండే శ్రీకాంత్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చి చూసేసరికి తన ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ. రెండు వేల నగదు, 15 తులాల వెండి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పట్టణవాసులు ఇతర గ్రామాలకు వెళ్లినప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు

## భక్తితోనే ముక్తి

సుభాష్‌నగర్, మే 19 : భక్తితోనే ముక్తి లభిస్తుందని ప్రముఖ ధార్మికవేత్త స్వామి బ్రహ్మానంద సరస్వతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజం ప్రాంగణంలో దివ్య మానవ నిర్మాణ విధి అంశంపై ఆయన ఆదివారం ప్రవచనాలు చేశారు. అన్ని జన్మలకన్నా మానవ జన్మ ఉత్తమమైందని, అలాంటి జన్మను సత్కర్మలతో సార్థకం చేసుకోవాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ ప్రతినిధులు వేద మిత్ర, కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రకృతివనం.. కళా విహీనం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎండిపోయి ఆకులు రాలుతున్న మొక్కలు
- అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా 'వనం'



కాకులగుట్టతండా ప్రకృతివనంలో ఎండిపోయిన చెట్లు





వనంలో మద్యం బాటిళ్లు

మాచారెడ్డి, మే 19 : గ్రామ గ్రామాన పచ్చదనం పెంపొందించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఎన్నో రకాల పూల మొక్కలను నాటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ఇందులోనే వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసింది. దీంతో ప్రకృతి వనాలు పట్టణాల్లోని పార్కులకు దీటుగా మారాయి. గ్రామస్తులకు ఆహ్లాదం పంచుతున్న పల్లె ప్రకృతి వనాలను ప్రస్తుతం పట్టించుకునే వారే కరువయ్యారు. పర్యవేక్షణ కరవవడంతో పచ్చని మొక్కలు ఎండిపోయి ఆకులు రాలిపోతున్నాయి.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

కాకులగుట్టతండా గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కళాహీనంగా మారింది. గేటు ఉన్నా చుట్టు ఫెన్సింగ్ లేకపోవడంతో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకృతి వనంపై అధికారులు కనీసం దృష్టిసారించడం లేదు. పచ్చగా ఉండాల్సిన ప్రకృతి వనం నేడు కళా విహీనంగా మారడంతో తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి పోవడంతో గ్రామాల అభివృద్ధికి ప్రస్తుతం ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికైనా వారు స్పందించి పల్లె ప్రకృతి వనాలను గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



జిల్లా కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో పదోతరగతి (1998-99 బ్యాచ్) విద్యార్థులు స్థానిక ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏండ్ల తరువాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

-కామారెడ్డి, మే 19



బాన్సువాడ మండలంలోని కొల్లూర్ గ్రామంలో రైతులు సిద్ధం చేస్తున్న నారుమడి

## 'వానకాలం' సాగుకు రైతులు సిద్ధం

బాన్సువాడ, మే 19 : బాన్సువాడ డివిజన్‌లోని బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కురిసిన చిన్నపాటి వర్షాలకు ఒకవైపు పొడి దుక్కులు దున్నుతున్న రైతులు.. మరోవైపు నారుమడులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రాథమిక సహకార సంఘాల్లో జీలుగ, జనుము విత్తనాలు అందుబాటు ఉంచారు. దీంతో రైతులు దుక్కిలో జీలుగ, జనుము విత్తనాలను వేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

## జీలుగ విత్తనాలను సరఫరా చేయండి

ఎల్లారెడ్డి, మే 19: వానకాలం పంటల సాగుకు ముందుగానే జీలుగ విత్తనాలను సరఫరా చేయాలని మండల రైతులు కోరుతున్నారు. ఇప్పటికే విత్తనాలు అందుబాటులో ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విత్తనాలు ఇంకా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల ముందుగానే విత్తనాలు వేస్తేనే అవి పెరిగి ఏపుగా వస్తాయని, వాటిని దుక్కిలో కలియ దున్నడంతో పంటకు పుష్కలమైన పోషకాలు అందుతాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టి జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు. అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే జీలుగ విత్తనాల కోసం డబ్బులు చెల్లించినా.. పంపిణీలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుంచి విత్తనాల పంపిణీ

నస్రుల్లాబాద్, మే 19: బీర్కూర్ మండల పరిధిలోని దామరంచ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏఈవో శ్రావణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని 60శాతం సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 30 కేజీల బస్తా సబ్సిడీపై 1116 రూపాయలకు అందించనున్నట్లు తెలిపారు. రైతులు పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో రావాలని ఆయన సూచించారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి, మే 19 : జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్‌లోని ఇష్ట కార్య సిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గంగవరపు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర, నవగ్రహ పూజలు కొనసాగాయి. హనుమాన్ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## చుక్కాపూర్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి, మే 19 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విష్వక్సేన ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీధర్ రావు తెలిపారు. సోమవారం ధ్వజారోహణం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయాభివృద్ధి కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన చిలుక శారద, సంతోష్ దంపతులు రూ.51,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఈవో శ్రీధర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

## వాహనాల తనిఖీ

రాజంపేట్, మే 19: రాజంపేట మండల శివారులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేని, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఏఎస్సై గంగారెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది భాస్కర్, దేవేందర్ పాల్గొన్నారు.





బాన్సువాడ - కామారెడ్డి ప్రధాన రహదారిపైపొతంగల్ కలాన్ వద్ద కంకర వేసి వదిలేసిన రోడ్డు

# కంకర వేశారు.. తారు మరిచారు

**బాన్సువాడ- కామారెడ్డి రహదారిపై వాహనదారులకు ఇబ్బందులు**

గాంధారి, మే 19: మండలంలోని కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై పొతంగల్ కలాన్ స్టేజీ నుంచి చందానాయక్ తండా వరకు రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. ఈ రహదారిపై ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై సుమారు ఐదు కిలోమీటర్ల వరకు ఆరు నెలల క్రితం కంకర వేశారు. దానిపై తారు వేయకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కంకర ఉండడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఈ రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు ప్రమాదానికి గురై మరణించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రోడ్లపై గుంతలు.. అధికారుల కండ్లకు గంతలు

- ప్రమాదాలు జరుగుతున్నా వీడని నిర్లక్ష్యం
- సామాన్యుల ప్రాణాలతో చెలగాటం
- కానరాని హెచ్చరిక బోర్డులు



సూచిక బోర్డులు, సైడ్ వాల్ లేని వంతెన



కొత్తగా నిర్మించిన రోడ్డుపై ఏర్పడిన గుంత



అప్రమత్తంగా ఉండకుంటే.. గుంతలో పడాల్సిందే..

డోంగ్లీ, మే 19: అధికారుల నిర్లక్ష్య వైఖరి ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నది. రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరిగి పలువురు గాయాలపాలవుతున్నారు. గుంతలు ఏర్పడిన ప్రధాన రహదారిపై అధికారులు ప్రయాణిస్తున్నా వారికి అవి కనిపించడం లేదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించాలని కోరుతున్నారు. డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీ నుంచి పెద్ద టాక్లీకి వెళ్లే దారిపై రెండో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. సుమారు రెండు అడుగుల లోతు వరకు ఉన్న ఆ గుంతలో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి నీరు నిండి ఏర్పడడం లేదు. రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద వాహనాలు సైతం అదుపు తప్పుతున్నాయి. ఈ దారి మీదుగా మద్నూర్, దెగ్లూర్‌తోపాటు జుక్కల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వాహనదారులు బోధన్, నిజామాబాద్ తదితర పట్టణాలకు ప్రయాణిస్తుంటారు. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినా రోడ్లు, భవనాల శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు..**

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మూలమలుపు వద్దకు వెళ్లే వరకు అక్కడ మలుపు ఉన్నదనే విషయం తెలియడం లేదు. సూచిక, ప్రమాదకర బోర్డులు కూడా ఏర్పాటు చేయ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**అసంపూర్తిగా వంతెనల నిర్మాణం..**

లింబూర్ నుంచి చిన్న టాక్లీ మధ్య రెండు వంతెనలు నిర్మించారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా.. ఇప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. వంతెనకు ఇరువైపులా రక్షణగా గోడలు(సైడ్ వాల్స్) కూడా లేవు. ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. వంతెనకు ఇరువైపులా అలాగే వదిలివేయడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో సామాన్యుల ప్రాణాలకు సంకటంగా మారింది. ఇకనైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## కొనుగోళ్లు వేగవంతం చేయండి సారూ..!



మల్లయపల్లిలో ఆరబోసిన ధాన్యం

ఎల్లారెడ్డి, మే 19: వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మండలంలోని మల్లయపల్లి, పెద్దారెడ్డి, జంగమాయపల్లి, ఎల్లారెడ్డి, ఆజామాబాద్, తిమ్మారెడ్డి గ్రామాల రైతులు కోరుతున్నారు. నెల రోజుల నుంచి ధాన్యం కుప్పలుగా పోశామని, కాంటా కోసం వేచిచూస్తున్నామని వారు పేర్కొంటున్నారు. ప్రతి రోజూ తూకం కావడం లేదని, వాహనాలు కూడా సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు వర్షానికి ధాన్యం తడిసిందని తెలిపారు. తమ గోసను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలోని మార్పులతో వర్షాలు కురుస్తున్నాయని, కొనుగోళ్లను వేగవంతం చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు అంటున్నారు.

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

గాంధారి, మే 19: మండలంలోని సీతాయిపల్లిలో ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. కొబ్బరికాయ కుస్తీతో ప్రారంభమైన పోటీలు.. కడెం కుస్తీతో ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలతోపాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు నగదుతోపాటు వెండి కడియాన్ని బహూకరించారు. పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది.



పోటీలో తలపడుతున్న మల్లయోధులు

## 'రండి.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి'



అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

బిచ్కుంద, మే 19: 'రండి.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి..' అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు బిచ్కుంద డిగ్రీ కాలేజీ అధ్యాపకులు. కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రము ఖర్జీ సూచనలతో అధ్యాపకులు గ్రామాల్లో పర్యటిస్తూ.. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలుస్తున్నారు. ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను వివరిస్తున్నారు. కాలేజీలో ఎన్ఎస్ఎస్‌లో చేరే అవకాశం ఉన్నదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరవుతాయని తెలియజేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, సద్వినియోగం చేసుకోవాలని వివరిస్తున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గౌస్, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.